క్లుప్తంగా

బడ్జెట్‌లో నిరుపేదలకు భరోసా ఏదీ?


మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి

తిరుపతి సిటీ: రూ.50 లక్షల కోట్లతో ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో నిరుపేదలకు భరోసా లేకపోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఆయన శనివారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో చేసిన బడ్జెట్ ప్రసంగంపై స్పందించారు. ఏపీకి బడ్జెట్ వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. బడ్జెట్‌లో నూతన పెన్షన్ స్కీమ్ గురించి ప్రస్తావించడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధిని కేంద్రం బాధ్యతగా తీసుకోకుండా అరకొర నిధులు కేటాయించినట్లు ప్రకటించారని తెలిపారు. పోలవరంపైనా కపట ప్రేమతో వ్యవహరించారని, వ్యవసాయ రంగానికి కేటాయింపులు ఆశించిన మేర లేవన్నారు. విద్య, వైద్య రంగాలకు నిధులు కేటాయింపు సంతృప్తికరంగా లేదన్నారు. మధ్యతరగతి వర్గానికి కాస్త ఊరట కలిగించినా పేదలకు నిరాశే కలిగించిందన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి


డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఈవో బాబ్జి, నాయకులు

పాకాల : ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం స్థానిక ఎమ్మార్సీలో సంఘం డైరీని ఎంఈవో బాబ్జి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.రామమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. పీఆర్సీని అమలు చేయని పక్షంలో ఐఆర్ ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, చెల్లించాలని, ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రభు, సుధాకర్, యువరాజు, వెంకటస్వామి, రాజేంద్ర, చంద్ర, శ్రీరాములు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం


ప్రార్థనలు చేస్తున్న సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదిరి

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఎదురుగానున్న దర్గాలో హజ్రత్ పీర్ సయ్యద్ అమానుల్లాషా ఖాదిరి 79వ గంధోత్సవాన్ని ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఉర్దూ కవి సమ్మేళనం చేపట్టారు. ముజాఫర్ల విన్యాసాలు, ఖవ్వాలి ఆకట్టుకున్నాయి. దర్గా నాలుగో పీఠాధిపతి సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదిరి మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ముస్లిం గురువుల పట్ల భక్తి ప్రపత్తులతో గంధోత్సవం నిర్వహించడం సంతోషకరమన్నారు. ముస్లింలు తమకున్నంతలో పేదలకు సాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తికి చెందిన షేక్ మిల్సాన్ సర్వర్, గూడూరుకు చెందిన షేక్ మగ్దూ కుస్తీ, డాక్టర్ అమీనుల్లా, డాక్టర్ సత్తార్ సాహెబ్, డాక్టర్ నిషాన్‌నుల్లా, ముతవల్లీలు షేక్ మహ్మద్, షేక్ ఛాంద్ బాషా, ఖాదర్‌బాషా, షేక్ సిరాజ్, న్యాయవాది రామనాథన్ పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: కంచి మఠం పాదుకా మండపంలో ఆదివారం శ్రీవెంకట గాయత్రి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 60 ఏళ్లు నిండిన బ్రాహ్మణ దంపతులకు షష్టిపూర్తి, 70 ఏళ్లు నిండిన వారికి భీమరథ శాంతి, శాంతి హోమం చేపట్టారు. అనంతరం ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఇందులో ఎస్వీ వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, సంస్కృతి విద్యాపీఠం వీసీ జీఎల్.కృష్ణమూర్తి, సంస్థ చైర్మన్ సీఆర్‌కే.శేషగిరిరావు, శమంతకమణి, ఎంఎస్.విశ్వనాథ్, రవిశంకర్, వాసుదేవ శర్మ, భాగవతుల జయలక్ష్మి, పద్మావతి, అపర్ణ పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ ఎన్నిక నేడే

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవి కోసం కూటమి నేతలు అడ్డదారులు తొక్కుతున్నారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను లాక్కొని పదవిని దక్కించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ప్రలోభాలకు లొంగని వారిపై కుట్రలకు తెరలేపారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్నారు. స్పష్టమైన మెజారిటీతో డిప్యూటీ మేయర్ పదవిని దక్కించుకుంటామని వైఎస్సార్ సీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇందులో భాగంగా విప్ జారీ చేసింది. ఎవరైనా విప్‌ను ధిక్కరిస్తే వేటు దప్పదని హెచ్చరించింది.


కార్పొరేషన్ కార్యాలయం

- వైఎస్సార్ సీపీకి స్పష్టమైన మెజారిటీ
- బెదిరింపులతో గెలిచేందుకు కూటమి నేతల కుట్రలు
- విప్‌ను ధిక్కరిస్తే వేటు తప్పదు
- ఫిరాయింపుదారుల్లో ఆందోళన
- 46 మంది కార్పొరేటర్లు ఓ వైపు..
- ఒక కార్పొరేటర్ మరోవైపు కూర్చోవాల్సిందే..
- తిరుపతి రాజకీయాలను గమనిస్తున్న ప్రజలు

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్-2 ఎవరనేది మరి కొన్నిగంటల్లో తేలిపోనుంది. స్పష్టమైన మెజార్టీతో డిప్యూటీ మేయర్ పదవిని కై వసం చేసుకుంటామని వైఎస్సార్ సీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. దొడ్డిదారిలోనైనా ఈ స్థానాన్ని కొట్టేయాలని కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారు. ఈ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్లో సోమవారం ఉదయం 11 గంటలకు కార్పొరేటర్లు డిప్యూటీ మేయర్‌ను చేతులు ఎత్తి ఎన్నుకోనున్నారు. జాయింట్ కలెక్టర్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. టీడీపీ తరఫున గెలిచిన ఒకే ఒక్క కార్పొరేటర్‌తో పాటు పార్టీ ఫిరాయింపుదారులపై కూటమి నేతలు ఆధారపడ్డారు. అధికార బలంతో బెదరింపులే ఆయుధంగా డిప్యూటీ మేయర్ పదవిని దక్కించుకోవాలని కుయుక్తులు చేస్తున్నారు. తిరుపతి నగర పాలక సంస్థలో 50 డివిజన్లు ఉన్నాయి. వీటిలో 49 డివిజన్లకు ఎన్నికలు జరిగాయి. ఇందులో 48 డివిజన్లను వైఎస్సార్ సీపీ దక్కించుకుంది. ఇటీవల 24వ డివిజన్ కార్పొరేటర్ అనారోగ్యంతో మృతి చెందారు. భూమన అభినయ్ రెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడంతో 4వ డివిజన్ కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల సంఖ్య 46 చేరింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఐదుగురు కార్పొరేటర్లు ప్రలోభాలకు లోనై కూటమి పంచన చేరారు. మరో నలుగురు స్వప్రయోజనాలను ఆశించి ఆ ఐదుగురితో చేతులు కలిపారు. గడిచిన నాలుగు రోజులుగా కూటమి నేతల బరితెగింపులకు భయపడి ముగ్గురు కార్పొరేటర్లు స్తబ్దుగా ఉన్నారు. అయినప్పటికీ వైఎస్సార్ సీపీ 34 మంది కార్పొరేటర్లు ఉండడంతో గెలుపు ధీమాతో ఉంది. టీడీపీ గుర్తుపై గెలిచిన ఆర్సీ మునికృష్ణతోపాటు ఫిరాయింపుదారులైన 12 మందిపై కూటమి నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఫిరాయింపుదారుల్లో ముగ్గురు కార్పొరేటర్లు తిరిగి సొంత గూటికి చేరేందుకు సిద్ధంగా ఉన్నారు.

వైఎస్సార్ సీపీ విప్ జారీ

డిప్యూటీ మేయర్ పదవిని దక్కించుకునేందుకు పూర్తి మెజార్టీ ఉండటంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. బలం లేని కూటమి నేతలు అధికార దాహంతో బెదిరింపులతోనైనా డిప్యూటీ మేయర్ పదవిని దక్కించుకోవాలని కుయుక్తుల పన్నుతూనే ఉన్నారు. డిప్యూటీ మేయర్ పదవి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయ కర్త భూమన అభినయ్‌రెడ్డి, నగర మేయర్ డాక్టర్ శిరీష కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. ఈ ఎన్నికకు వైఎస్సార్ సీపీ విప్ జారీ చేయడంతో ఫిరాయింపుదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. విప్ ధిక్కరిస్తే అనర్హత వేటు పడుతుందన్న భయం వారిలో పట్టుకుంది. విప్ ధిక్కరించి భిన్నంగా ఓటేసినా, ఎన్నికకు గైర్హాజరైనా పార్టీ ఫిరాయింపు చట్టంలో నలిగిపోవాల్సి వస్తుంది. విప్ జారీ చేసిన వెంటనే కౌన్సిల్ హాల్‌లో పార్టీల వారీగా కార్పొరేటర్లు కూర్చోవాల్సి ఉంటుంది. దీంతో వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన 46 మంది కార్పొరేటర్లు ఒక పక్కన, టీడీపీ నుంచి గెలిచిన ఒక్క కార్పొరేటర్ ఒంటరిగా మరో పక్క కూర్చోవాల్సి ఉంటుంది. విప్ అతిక్రమించేవారిపట్ల కఠినంగా వ్యవహరించేందుకు వైఎస్సార్ సీపీ ఇప్పటికే న్యాయ నిపుణులను సంప్రదించింది. ఫిరాయింపు చట్టం అతిక్రమిస్తే తీసుకునే చర్యలపై సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పునిచ్చిందని పేర్కొన్నారు.

తిరుపతి ప్రశాంతతను దెబ్బతీయొద్దు


నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతికి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, అలాగే ప్రశాంతతకు మారు పేరని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఫలితాల వరకే రాజకీయాలు ఉంటాయని, ఆస్తులపై దాడులు చేసిన సందర్భాలు లేవన్నారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా విష సంస్కృతికి పాల్పడడం మంచిది కాదన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక జరిపి ప్రజల మన్ననలు పొందాలని పేర్కొన్నారు. 'మూడునాళ్ల డిప్యూటీ మేయర్ ముచ్చట కోసం ప్రతిపక్షాలకు అస్త్రంగా మారకండి. ప్రజాదరణ కలిగిన నాయకులను కూటమిలోకి స్వాగతించండి' అని హితవుపలికారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

తిరుపతి కల్చరల్: హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపునేని హరికృష్ణ ధ్వజమెత్తారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌యూనియన్ నగర కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 387 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉంటే తిరుపతిలో ఎన్‌జీవో సంస్థ రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది నియామకం, బదిలీల విషయంలో రాస్ సంస్థ ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కుతోందన్నారు. తిరుపతిలో ఐసీడీఎస్ ప్రాజెక్టులను ప్రభుత్వ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. పి.వెంకటరత్నం, సుజాత, అరుణ, యాశ్విన్, గంగాదేవి, హేమావతి, విమల, నిర్మల పాల్గొన్నారు.

స్థూల దేశీయోత్పత్తి పెంపు దిశగా బడ్జెట్

– చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి దేవరకొండ


మాట్లాడుతున్న స్విమ్స్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి దేవరకొండ

తిరుపతి కల్చరల్ : స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)ని పెంచి వికసిత భారత్‌గా అభివృద్ధి చేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని స్విమ్స్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి దేవరకొండ వెల్లడించారు. న్యూబాలాజీ కాలనీలోని గ్రీన్ హోమ్ డెవలపర్స్ కార్యాలయంలో ఆదివారం పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఆర్‌ఎస్‌ఐ) తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో బడ్జెట్-2025పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో భారత్ 5 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ దిశగా వృద్ధి చెందేందుకు అడుగులు వేస్తోందన్నారు. ఇందులో భాగంగా పన్నుల్లో అనేక సంస్కరణలు తెచ్చిందన్నారు. దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాలు, వ్యవసాయం అభివృద్ధి చెందేందుకు పెద్ద పీట వేసిందన్నారు. తయారీ రంగంలో యువతను, మహిళలను ప్రోత్సహించేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ మాట్లాడుతూ ఆదాయ పన్ను స్లాబ్‌ను రూ.12 లక్షలకు పెంచడం సంతోషకరమన్నారు. మార్కెట్‌లో నగదు పెరిగితే చిన్న వ్యాపారాలు చేసే మధ్య తరగతి ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. యూపీఐ చెల్లింపులు పెరుగుతుండడంతో చిన్న వ్యాపారాలు చేసే వారు కూడా జీఎస్టీ పరిధిలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఉద్యోగులు, వ్యాపారులు ప్రతి ఏటా జూలై 31 లోపు రిటర్న్స్ ఫైల్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర రంగాల్లోని ఉద్యోగులు, చిరు వ్యాపారులు, పెద్ద వ్యాపారవేత్తలకు వర్తించే పన్నులు, పన్ను మినహా యింపునకు ఉన్న మార్గాలను తెలియజేశారు. కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌ఐ తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్, కార్యవర్గ సభ్యులు రాజేష్, ఆర్‌సీకే.రాజు, మధుసూదన్, మాజీ చైర్మన్లు డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సుధాకర్‌రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యుడు హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కళలు దేశ సమైక్యత, సమగ్రతకు చిహ్నాలు

తిరుపతి కల్చరల్: కళలు దేశ సమైక్యతకు, సమగ్రతకు చిహ్నాలని, అలాంటి కళలను మరింత ప్రోత్సహించి ఆదరించాలని ఏపీ ప్రభుత్వ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జీవకోనలోని గురుకృప పాఠశాలలో ఆదివారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నేస్తం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జానపద సంగీత, నృత్యోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అరుదైన కళలను, కళాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించి మన భాష, సంస్కృతులను పరిరక్షించాలని కోరారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు, కోలాటం ఆకట్టుకున్నాయి. బాలికల వసతి గృహం మెడికల్ ఆఫీసర్ జయశ్రీ, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ నరసింహులు, నేస్తం కార్యదర్శి ఏడుకొండలు, దళిత జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు గంగాధరం, లీలావతి, షణ్ముగం, ధరణి పాల్గొన్నారు.

ఘనంగా ఎద్దుల పందేలు


మోహిత్‌రెడ్డి ఫొటో ఉన్న పలకతో యువత

పాకాల: మండలంలోని ఇరంగారిపల్లిలో ఆదివారం ఎద్దుల పందేలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ దేవతలకు పొంగళ్లు పెట్టారు. అనంతరం ఎద్దులను అలంకరించారు. వాటి కొమ్ములకు తమ అభిమాన నేతల చిత్రాలతో పలకలు కట్టారు. వాటిని బెదిరించారు. వాటిని నిలువరించేందుకు యువకులు ఉత్సాహం చూపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట


ధ్వజస్తంభానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం చినిగేపల్లెలో కట్టమీద గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ శిఖరంపై కలశ స్థాపనను శాస్త్రోక్తంగా చేపట్టారు. 28 అడుగుల ధ్వజ స్తంభానికి చినిగేపల్లె, మారసానివారిపల్లె, కురవపల్లె, దళితవాడ గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్టించారు. ఆలయ ధర్మకర్త డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి, నాగలక్ష్మి, సర్పంచ్ సింహాల విమలమోహన్ పాల్గొన్నారు.

ఎర్రజెండా పోరాటాలతోనే చట్టాలు


సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్: ఎర్రజెండా పోరాటాల ఫలితంగానే దేశంలో అనేక చట్టాలు వచ్చాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు తెలిపారు. కామ్రేడ్ కృష్ణారెడ్డి నగర్‌లో ఆదివారం సీపీఐ శతవసంత వార్షికోత్సవాల సందర్భంగా కామ్రేడ్ కృష్ణారెడ్డి స్థూపానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సీపీఐ వందేళ్ల పోరాటాల స్ఫూర్తితో ప్రజల్ని మరింత చైతన్యవంతం చేసి పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టాలను నీరుగార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి ఇచ్చిందన్నారు. ఈ నెల 10న ఇళ్ల స్థలాల కోసం జరిగే పోరాటంలో ఇళ్లు లేని పేదలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, నదియ, విశ్వనాథ్, బండి చలపతి, ఎన్‌డీ.రవి, శివ, కేవై.రాజా పాల్గొన్నారు.

ఎన్‌ఐసీ క్యాంపునకు మహిళా వర్సిటీ విద్యార్థులు


ఎంపికైన విద్యార్థినులను, ఆఫీసర్‌ను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : నరసాపూర్ వేదికగా సోమవారం నుంచి ఈ నెల 10 వరకు జరగనున్న నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌లో మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు పాల్గొననున్నారు. క్యాంపునకు ఎంపికైన విద్యార్థినులు లావణ్యకుమారి, రితిగ, ఏపీ కాంటిన్జెంట్ లీడర్‌గా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై అనితను వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని ఆదివారం అభినందించారు. ప్రోగ్రాం ఆఫీసర్స్ స్వాతి, మాధవి పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడంపై హర్షం


డప్పులు వాయిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నేతలులు

చంద్రగిరి: దళిత నాయకుడు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై ఎస్సీలు హర్షం వ్యక్తం చేశారు. వారు ఆదివారం స్థానిక నూర్ జంక్షన్ నుంచి టవర్ క్లాక్ వరకు డప్పులు వాయిస్తూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కత్తి నాగార్జున, ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకుడు పులికుంట్ల గోపి మాదిగ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వేలూరు రాజేంద్ర మాదిగ, బోయినపల్లి రవి మాదిగ, సంగీతం రామ్మూర్తి, అంజి, కత్తి ఓబులేష్, వెంకటపతి, సిద్దయ్య పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

తిరుపతి కల్చరల్: పుస్తకంతో మైత్రి చేసుకుంటే అద్భుత విజ్ఞానాన్ని అందిస్తుందని ఎస్వీ వేదిక్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణి సదాశివమూర్తి తెలిపారు. ఇస్కాన్ రోడ్డులోని క్రీడా మైదానంలో టీటీడీ సౌజన్యంతో భారతీయ విద్యా భవన్ చేపట్టిన పుస్తక ప్రదర్శన ఆదివారమూ కొనసాగింది. ఈ సందర్భంగా సారంగపాణి వేదికపై గేయావధానం నిర్వమించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకుంటే గొప్ప విజ్ఞాన వంతులుగా ఎదుగుతారని తెలిపారు. భారతీయ విద్యాభవన్ సంచాలకుడు సత్యనారాయణరాజు మాట్లాడుతూ సంగీతం మనుషులతోపాటు పశుపక్షాదులను కూడా ఆకర్షిస్తుందన్నారు. అనంతరం స్విమ్స్ డీన్ భారతీయ అల్లాడి మోహన్ సాయి బ్రహ్మానందం రచించిన మనకు తెలియని మన త్యాగరాజు అనే పుస్తకాన్ని పరిచయం చేశారు. వెలుగోటి భాస్కర సాయి కృష్ణ యాచేంద్ర ప్రదర్శించిన గేయావధానం సభికులను విశేషంగా ఆకట్టుకుంది.

ఘంటసాల పాటల పోటీలకు విశేష స్పందన

తిరుపతి కల్చరల్: ఘంటసాల ది గ్రేట్ చిత్రం విడుదలను పురస్కరించుకుని ఆదివారం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించన ఘంటసాల పాటల పోటీలకు విశేష స్పందన లభించింది. సీనియర్ మహిళల విభాగంలో కుమారి, అనూష బహుమతులు అందుకున్నారు. అలాగే పురుషుల విభాగంలో నారాయణరావు, బి.కరుణాకర్, వి.శ్రీనివాస్‌శర్మ, ఓబుళపతి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి అందుకున్నారు. ఇక్కడ గెలుపొందిన వారు ఈ నెల 11న విజయవాడలో జరిగే ఫైనల్ పోటీల్లో పాల్గొంటారు. రిటైర్డ్ ప్రొఫెసర్ వాసుదేవరావు, సప్తగిరి కృష్ణ, ఛాయాగ్రహకుడు వి.శ్రీనివాసరావు, ఘంటసాల బయోపిక్ సినిమా దర్శకుడు రామారావు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా ఘంటసాల అవధాని డాక్టర్ రహమతుల్లా, సహృదయ సంస్థ అధినేత పి.రాజేష్, వై.అరవింద్ వ్యవహరించారు.

అడ్డదిడ్డంగా బస్సులు

- తప్పని ట్రాఫిక్ ఇక్కట్లు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ప్రతిరోజూ ట్రాఫిక్ కష్టాలుతప్పడం లేదు. ఈ బస్టాండ్‌కు వివిధ రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ 2 వేల బస్సులు సర్వీసులు వచ్చిపోతుంటాయి. తూర్పు వైపు నుంచి అన్ని సర్వీసులు బస్టాండ్‌లోకి వస్తాయి. తూర్పు వైపున అడ్డదిడ్డంగా ఆటోలు పెట్టేస్తున్నారు. పడమర వైపు మీదుగా దక్షిణం వైపు నుంచి సర్వీసులు బయటకువెళతాయి. దక్షణం వైపు వెలుపలికి వెళ్లే సమయంలో శ్రీకాళహస్తి డిపో సర్వీసులతోపాటు పలు సర్వీసుల బస్సులకు టికెట్లు కొట్టేందుకు నిలుతూ ఉంటారు. దీంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఆ మార్గంలో వెళుతున్న ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇలా ప్రతిరోజూ సమస్య ఉత్పన్నం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

అక్రమ కట్టడాలు కోకొల్లలు

- కూటమి నేతల అండతో పెరుగుతున్న అనధికారిక నిర్మాణాలు
- తిరుపతిలో 22 ఏ నిషేధిత జాబితాలో 40 శాతం భూములు


శాంతినగర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భారీ భవనం, తిరుమల బైపాస్ రోడ్డులో ఆరు అంతస్తుల అనధికార నిర్మాణాలు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో కూటమి నేతల కనుసన్నల్లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. 22 ఏ నిషేధిత జాబితాలోని భూముల్లోనూ భవన నిర్మాణాలు చేస్తున్నారు. డిప్యూటీ మేయర్ అభ్యర్థి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల ఆస్తులపై దాడులకు తెగబడుతున్న అధికారులకు ఇలాంటి నిర్మాణాలు కనిపించవా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డికి చెందిన రెండు భవనాలను నిషేధిత జాబితాలో నిర్మించారని పేర్కొంటూ శాంతినగర్‌లోని భవనం కూల్చిన అధికారులు అదే వీధిలోని మరో రెండు భవనాల జోలికి వెళ్లకపోవడం ఆశ్చర్యం కలిగించింది. తిరుమల బైపాస్ రోడ్డు లోటస్ గ్రాండ్‌కు అనుకుని భారీ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతంలోని భూములు 22 ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయి. సెల్లార్ నిర్మాణంపై నిషేధం ఉంది. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే నిషేధిత జాబితాలో ఉన్న భూములకు విముక్తి కలిగించడంపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సుమారు 25 వేల మందికి లబ్ధి చేకూరేలా 22ఏ నిషేధిత జాబితాను ఎత్తివేయించారు. అలాంటి మంచి పనులు చేయాల్సిన పాలకులు, అధికారులు ప్రజలపై కక్షగట్టి వ్యవహరించడం మంచిది కాదని హితవు పలుకుతున్నారు.

కార్పొరేటర్లపై కొనసాగుతున్న వేధింపులు

డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున గెలిచిన కార్పొరేటర్లకు కూటమినేతల నుంచి బెదిరింపులు కొనసాగుతూనే ఉన్నాయి. తమకు అనుకూలంగా ఓటు వేయకపోతే మీ ఆస్తులను ధ్వంసం చేస్తామని, అక్రమ కేసులు బనాయిస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఒకరిద్దరు ఈ బెదిరింపులకు లోనై కూటమికి మద్దతు ఇస్తుండగా, మరి కొందరు ఏదైనా చేసుకోండి అంటూ ఎదురు తిరుగుతున్నారు. కార్పొరేటర్లకు సంబంధించిన ఆస్తుల వివరాలను కొంతమంది అధికారులు అధికార పార్టీ నేతలకు అందిస్తున్నారు. వారి తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.